చక్రవర్తి శకుంతల



# లాభసాటి బేరం

నల్లని ముఖ్ మల్ (Velvet) పట్టు పెట్టెలో అమర్చిన ముత్యాల హారం. అద్దపు బీరువాలో నుంచి తన కాంతిని విరజిమ్ముతూ ఉంది. కన్నయ్యశెట్టి దాని ఎదురుగా కొంచెంసేపు నిలుచొని, దాని అందాన్ని, గొప్పతనాన్ని నిదానించి చూస్తూ ఉన్నాడు.

దానిని ఇరవైవేల రూపాయలకు

తక్కువ అమ్మకూడదు అని అతని తలంపు. అయితే నిజానికి శెట్టి దానిని చాలా తక్కువ వెలకు కొన్నాడు. ఒక మార్వాడీ దివాలా తీసినప్పుడు అతని సామానంతా వేలం వేస్తూంటే దానిలో కన్నయ్య శెట్టి ఈ హారాన్ని కొన్నాడు. మంచి ముత్యాలు ఆ పెట్టెలో ఉండి, పరీక్షకు నిలిచేవయితే ఆ వెలకు ఎవరైనా సందేహం లేకుండా కొని తీసుకుపోతారు. శెట్టికి దానిలోని లోపాలు తెలుసును. భూతద్దంతో నిపుణులైనవాళ్ళు చూస్తే దానిలోని తప్పు జీరలూ, నొక్కులూ కనిపెట్టగలరు. కాని సాధారణంగా కనబడవు. ఎవరైనా కొత్త ధనికులు దొరక్కపోతారా అని ఎదురు చూస్తున్నాడు.

ఇంతలో పల్లెటూరు రైతువలె కనబడుతున్న ఒక ఆసామి అంగడిలోకి వచ్చి ఆ హారం వంకనే చూస్తున్నాడు. శెట్టికి కొంచెం సంతోషం కలిగింది.

"మంచి ముత్యాలహారం అనుకుంటాను" అన్నాడు ఆ ఆసామీ.

"ఆ మంచి జాతికి చెందిన ముత్యాలు. ఇది వెంకటగిరి సంస్థానం జవాహరీలోంచి వచ్చింది." అని శెట్టి దాని గొప్పతనాన్ని ఉద్ఘాటించాడు.

"వెల కూడా సరసంగానే ఉండవచ్చును." అని రైతు నెమ్మదిగా గొణుగుకొన్నాడు.

"ఆఁ. మీ లెక్కను ఇది సరసమే మరి ఇతరులకైతే ఎలాగుంటుందో చెప్పలేం." అని కొంచెం ముఖస్తుతి మేళవించి శెట్టి రైతుకు ఉత్సాహం కూర్చాడు. "అయితే, బాబూ మీదే ఊరు?" అని ప్రశ్నించాడు.

"మాది పశ్చిమ గోదావరి జిల్లా. కొవ్వూరు తాలూకా కొంచెం పనుండి వచ్చాను. మంచి ముత్యాలహారం మంచిది దొరికితే కొని తీసుకురమ్మని అమ్మాయి చెప్పింది. చూస్తే అది ఇక్కడే నాకెదురు పడింది."

"ఓహో పొగాకు రైతులా బాబూ. మీ పల్లె కాకపోతే ఇంకెవరు కొనగలరు ఇలాంటివి? బాబూ మీ పేరేమిటి?" అని శెట్టి ఇంకా ఉత్సాహం ఇనుమడింపజేశాడు రైతుకి.

"నా పేరు ముక్కపాటి చెలమయ్య. మా పొగాకు ఇప్పుడు జపానుకు ఎగుమతి చేస్తున్నాం."

"అయితే హారం చూస్తారా? బయటికి తియ్యమంటారా?"

"చూపేదేమిటి? వెల యెంత? మంచి ముత్యాలేకదూ?" అని చెలమయ్య తన ఉదారత్వాన్ని వెలిబుచ్చాడు.

కన్నయ్య శెట్టి ఇలాంటి ఛాన్సు దొరికినప్పుడు పోగొట్టుకోవడం ఎందుకు? అని ఏం వెల చెప్పుదునా అని మనస్సులోనే ఆలోచిస్తున్నాడు.

"ఎన్నాళ్ళా కావలసిన గుత్తులూ, నగలూ మొత్తం మూడు లక్షల రూపాయల వెలకు తీసుకున్నాను." అని చెలమయ్య మళ్ళీ ఆత్మసమ్మానాన్ని పెంచుకున్నాడు.

"ఈ హారం చరిత్ర దాని పురాతనత. ఇవన్నీ ఆలోచించితే నేను చెప్పబోయే వెల ఇంకా తక్కువే అన్నట్టుగా ఉంటుంది." అని ఉపోద్ఘాతం ఎత్తుతున్నాడు కన్నయ్య శెట్టి.

"డబ్బు, డబ్బుకు లక్ష్యంలేదు." అంటూ కోటు లోపలి జేబులోంచి పెద్దకట్ట నూరు రూపాయల నోట్లు ఈవలకు లాగుతూ." అది కావలసినంత ఉంది. మంచి జాతైన ముత్యాలహారం ఉంటే డబ్బుకు లెక్కలేదు."

"వెల నిజంగా చాలా తక్కువ అనే చెప్పవచ్చు" అంటూ శెట్టి ముందు అనుకున్న ఇరవై వేలకి ఇంకో రెండువేలు–కాదు–అయిదువేలు జోడించి" దీని వెల ఇరవై అయిదు వేల రూపాయలు మాత్రమే" అని తేల్చాడు.

"అయితే ఇప్పుడు గట్టిచిక్కు వచ్చింది"

అంటూ పొగాకు రైతు ఆ నోట్లకట్ట సంచీ జేబులో పెట్టుకున్నాడు.

పాపం! శెట్టి తాను ఆలోచన తక్కువగా, దురాశ చూపినందుకు తనలో తన్ను నిందించుకొన్నాడు. "ఏం? వెల ఎక్కువ అయిపోయిందనుకుంటున్నాడా? కావలిస్తే ఆ విషయం మనం తరించి చూసుకోవచ్చును ఇంకా .."

"అబ్బే! వెలలో ఏమీ తప్పులేదు. నాకు వచ్చిన సమస్య ఇంకొకటి ఈ హారం మా అమ్మాయికి కొన్నట్టయితే అలాంటిదే అచ్చంగా అలాంటిదే. మా కోడలికి కూడా కొని యివ్వవలసి ఉంటుంది. సరే దీనికి ఇరవై అయిదు వేలు వెల నిర్ణయం అయిపోయింది ఇచ్చేస్తాను," అని చెలమయ్య చెప్పిన మాటలు కన్నయ్య శెట్టికి కొంచెం మనశ్శాంతి, ధైర్యమూ కలిగించాయి.

ఇలాంటిదే ఇంకోటి దొరకటం కష్టం అని అతను మనస్సులో ఎరిగి ఉన్నా" ఇలాంటివి ఇంకా రెండే ఈ దేశంలో ఉన్నాయి. ఒకటి నూజివీడు సంస్థానంలో వుంది. ఇంకోటి విజయనగరం కోటలోంచి పరారి అయింది. అది ఎక్కడ వుందో ఎవరికీ తెలియదు. మనం పెద్ద వెల ఇస్తామని ఆశ చూపితే బయటికి వచ్చునేమో అని ఆలోచిస్తున్నాను." అని కన్నయ్య శెట్టి కొంచెం కథ కట్టాడు.

"ఇంకోటి యిలాంటిది తెచ్చి నాకు ఇచ్చే విషయం వచ్చిన వెల అడుగు ఇస్తాను." అంటూ చెలమయ్య జేబులోంచి నోట్లకట్ట చేత తీస్తున్నాడు" అందాక "దీన్ని యిప్పుడు తీసుకొనిపోతాను. దీని వెలఎంత అయింది?"

"ఇరవై అయిదువేలు" అని కన్నయ్య కొంచెం చిన్న గొంతుకతో చెప్పాడు.

చెలమయ్య ఇరవై అయిదు వేలు ఇచ్చి హారం తీసుకొని జేబులో పెట్టుకున్నాడు.

"అయితే, మరొకటి అచ్చంగా ఇలాంటిదే దొరకటం కొంచెం కష్టం. [illegible]" అని శెట్టి బేరం జారిపోకుండా ఉండేట్టు సర్దుబాటుగా చెప్పాడు.

"ఏ వెల అయినా ఇస్తాను. కావలిస్తే దీనికి మూడు రెట్లు డెబ్బై అయిదు వేలు కావాలె అంటేకూడా ఇస్తాను. అయితే అచ్చంగా ఇలాంటిదే కావాలె. నేనింకా నాలుగు రోజులు పట్నంలో ఉంటాను. ఉడ్‌ల్యాండ్సులో బసచేసి ఉన్నాను. దొరికినట్టయితే నాకు కబురు చెయ్యి. లేకపోతే అనవసరంగా శ్రమపడనక్కరలేదు. నాకూ తీరిక లేకుండా లక్షపనులుంటాయి."

కన్నయ్య శెట్టి మానవ మనస్తత్వం ఊహించడంలో చాలా నిశితమైన బుద్ధి గలవాడు. ఈ బేరంలో మొత్తం ఇరవై రెండువేల రూపాయలు లాభం కొట్టాడు. ఇంకోటి ఇలాంటిది దొరకడం కష్టమే. ఈ బేరంలో మంచిలాభమే దొరికింది. దీంతో తృప్తిచెంది ఊరుకుందునా అని కూడా శెట్టికి తలంపు కలిగింది. డెబ్బై అయిదువేలు అయినా సరే ఇస్తానన్నాడు పొగాకు ఆసామీ. అది ఎందుకు పోనివ్వాలె అన్న ఆశ ప్రోత్సహించింది.

తన శాయశక్తులా ప్రయత్నించాడు. దీనికై కొంచెం ఖర్చు పెట్టినాకూడా నష్టం లేదని కన్నయ్య శెట్టి నిశ్చయం చేసుకున్నాడు. అన్ని పత్రికలలోనూ పూర్తి వివరాలు ఇస్తూ 'అలాంటి హారం కావలెను" అని ప్రకటనలు వేయించాడు. ఏమీ జవాబులు రాలేదు. చివరకు ఇంక రెండు రోజులకు చెలమయ్య పట్నం విడిచిపోతున్నాడనగా శెట్టికి ఒక టెలిఫోను వచ్చింది. నాగప్ప అనే ఒక బళ్ళారి ఆసామీ. కన్నెమరా హోటెలులో వున్నాననీ. తాను అప్పుడే సిలోను ప్రయాణం నుంచి తిరిగి వచ్చినట్టూ, తన దగ్గర ఈ వర్ణనకు సరిపడిన హారం ఒకటి సిలోను నుంచి తెచ్చినట్టూ చెప్పాడు. కన్నయ్య శెట్టి కాలహరణం చెయ్యకుండా, అప్పుడే కారులో కన్నెమరా హోటెలుకు పోయినాడు.

నాగప్ప బసచేసిన రూము తెలుసుకొని పోయి తలుపు తట్టగానే, అతని నౌకరు

తలుపు తెరిచాను. లోపల కూచోమని చెప్పాడు. నాగప్ప అప్పుడే స్నానపు గది లోనికి పోయి వున్నాడని చెప్పి ఒక గ్లాసులో పానీయం నింపి ముందు పెట్టాడు.

ఇంకో పావుగంట సేపటికి నాగప్ప పెద్ద తువాలు చుట్టుకొని డ్రెస్సింగు గౌను వేసుకొని, ఇంకో చిన్న తువాలుతో తల తుడుచుకుంటూనే వచ్చి "అయితే మీరు నా హారం కొందామని వచ్చారా?" అంటూ మందహాసాలతోను, క్షమాపణలతోనూ నిజమైన పెద్దమనిషి తరహాను వెళ్ళగక్కే మొహంతో కన్నయ్య చేతికి కరగ్రహణం చేశాను.

"నేను కోరిన వస్తువు సరిఅయినదిగా వుంటే ఇప్పుడే రొక్కం ఇస్తాను. అందులో ఏమీ సందేహంలేదు."

"ఏమో, నిజంగా నేను దానిని అమ్ముతానని చెప్పలేను. నాకు అమ్మవలెనన్న అవసరంలేదు. మీరు ఇచ్చే వెల నాకు సంతృప్తికరంగా ఉంటే పరవాలేదు. చూదాం." అంటూ తన నౌకరును చూపి పెద్ద ట్రంకులో పైననే పెట్టి ఉన్న చిన్న


ఆఖరి పోస్టింగ్ : 7-9-74 ఫలితం : 25-9-74 వార పత్రికలో

ఎంట్రీ ఫీజు : రు. 1/- ఆల్ కరెక్టుకు .0,000 రు॥లు పొందండి.

1) దేవుడు చేసిన ......
2) బందిపోటు ......
3) మంచి రోజులు ......
4) మామకు తగ్గ ......
5) అంతా మన ......

ప్రక్కన 5 సినిమా పేర్లు అసంపూర్తిగా ఇవ్వబడినవి. అవి పూర్తిచేసి పంపండి. ఆల్ కరెక్టుకు 40,000 రు॥లు మొదటి నాలుగు కరెక్టుకు 3,000 రు॥లు పొందండి. 25-8-74 లోపు అందిన ఎంట్రీ లేక ఎంట్రీలు పంపిన వారిలో 15 మందిని ఎన్నుకొని వారికి ఉచిత జీవితకాలపు బహుమతి ఇవ్వబడును. ఫస్టుడే కవరులో పంపిన, ముందుగా అందిన ఇరవదికి 25 రు॥లు చొప్పున ప్రత్యేక బహుమతి 25-8-74 లోపు అందరి కంటె ఎక్కువ ఎంట్రీలు పంపిన వారికి రెండు టిక్కెట్లు హైదరాబాదులో మూడురోజుల సౌహార్ద్ర యాత్ర.

(1) ఒకరు సాదా తెల్లకాగితంపై ఎన్ని ఎంట్రీలయినా పంపవచ్చును. ప్రతి ఎంట్రీకి 1 రూ॥ చొప్పున M.O. చేసి, M.O. రశీదు తమ ఎంట్రీలతో పాటు జతపరచవలెను లేనిచో పరిశీలించబడవు (2) మా సొల్యూషన్ (V.M. పద్ద కవరులో సీలుచేసి ఉంచబడిన)తో సమానముగా ఉన్నవారికి బహుమతులు ఇవ్వబడును. (3) బహుమతులు ఒకరు కంటె ఎక్కువమంది పొందినచో, సమానముగా పంచబడును. (4) పోస్టల్ ఆర్డర్లు కూడా పంపవచ్చును. (5) ఫలితం తెలుసుకోగోరువారు 45 పై॥ల స్టాంపులు జతపర్చండి.

వేరే తమ ఎంట్రీలు, M.O.లు లేదా పోస్టల్ ఆర్డర్లు :

రామలక్ష్మి సినీ సాహిత్య పదావళి

C/o లక్కీ లైన్, శివకోడు పాలెం, శివకోడు పోస్టు
రాజోలు తాలూకా. తూ॥గో॥జిల్లాకు పంపండి.

శ్యామలా సినీ సాహిత్య పదావళి సొల్యూషన్ (12-7-74) వారపత్రిక 1) దేవకన్య 2) అన్నదాత 3) అమ్మమాట 4) దైవబలం 5) అఖండుడు.

ఆల్ కరెక్ట్ బహుమతి పొందినవారు : 1) ఎ. హెచ్. లత, హైదరాబాద్. 2) ఎస్. కె. మూర్తి, పి. విల్లూరు.

ఉచిత జీవితకాలపు బహుమతి పొందినవారికి పోస్టుద్వారా తెలుపబడినవి.

నగల పెట్టెను తీసుకొనిరా" అని చెప్పాడు నాగప్ప.

నౌకరు వెంటనే వెనుక గదిలోకి పోయి ఆ నగలపెట్టె తెచ్చి టేబులుమీద పెట్టాడు. కన్నయ్యశెట్టి ఆత్రంగా అందుకొని తెరిచి పరిశీలిస్తూ ఉన్నాడు.

ఇంతలో నాగప్ప వెనుక గదిలోనికి పోయి అంతర్జాతీయతకు తగినట్లుగా వుండే మాట ధరించి వచ్చాడు.

"అయ్యా, మీరు ఏం వెల ఇవ్వగలరో తెల్పలేదు" అని అడిగాడు.

"గలగటం కాదు. దీని వెల ఇరవై అయిదు వేలు తాళవచ్చును. అని నాకు తోస్తూ ఉంది. అంతకు పైన తాళదు." అని జాగ్రత్తగా తూలుబాటు లేకుండా శెట్టి చెప్పాడు.

"మీకూ నాకూ కూడా కాలం వ్యర్థ పుచ్చుతూ వున్నారు." అని ఎర్రబారిన మొహంతో పెట్టె చేత పట్టుకొని నిలబడ్డాడు నాగప్ప.

"అదికాదు. దాని వెల అంత తాళను అని అన్నాను గాని, మీకు ఏవి కావలెనో చెబితే నేను ఆ వెల యిస్తాను," అని బేరం జెసికిపోకుండా మరుసగా అందుకున్నాడు శెట్టి

"ఎందుకు ఇన్నిమాటలు? కిందికి పైకి లాగకుండా ఒకటే వెల చెబుతాను. ఊరికే మీతో బేరాలాడటం నాకు ఇష్టంలేదు. నా వెల యాభై వేల రూపాయలు. ఇదే ఆఖరు మాట ఇష్టమయితే తీసుకోండి, లేకపోతే వదలిపెట్టి పోండి."

శెట్టికి ముచ్చెమటలు పోశనై. జేబు రుమాలు తీసి మొహం తుడుచుకుంటున్నాడు.

"మరేమంటారు శెట్టిగారూ?"

"నే ననుకున్న దానికంటె చాలా .... సరే. తీసుకుంటాను."

"మంచిది. ఇందులో మీకు ఇంకా చాలా లాభం ఉంది. నేను కొన్నదే నలభై వేలు పైచిలుకు. అదైనా పిలోనులో."

కన్నయ్యశెట్టి యాభై వేలు వెంటనే ఇచ్చి ముత్యాల హారం లోపలి జేబులో భద్రంగా పెట్టుకొని హోటేలు విడిచి పోయినాడు. చెలమయ్య సమ్మతించిన వెల ప్రకారం తనకు ఇంకా పాతిక వేలు లాభం ఉంది అని అంచనా వేసుకున్నాడు.

అంగడికి చేరడంతోనే ఈ శుభవార్త చెలమయ్యకు తెలియచెయ్యాలె అని ఓడ్ ల్యాండ్సుకు టెలిఫోను చేశాడు.

"ఎవరు? కొవ్వూరు తాలూకా నుంచి చెలమయ్యగారా?" అని ఆశ్చర్యంతో అడిగింది హోటేలు టెలిఫోను ఎక్స్ఛేంజిలో పనిచేసే తరుణీమణి.

"అవును. ముళ్ళపూడి చెలమయ్యగారు ఆయన ఇంకా రెండు రోజులకు మీ హోటేలు విడిచి పోబోతున్నారు." అని కన్నయ్యశెట్టి వివరాలతో సహితంగా చెప్పాడు.

"ఇక్కడ ఎవరూ ముళ్ళపూడి చెలమయ్యగారు లేరు."

"ఏమిటి? సరిగా చూసి చెబుతున్నారా?" అని కన్నయ్యశెట్టి కంగారు పడుతూ అడిగాడు.

"మా హోటేలుకి ఆ పేరుతో కొవ్వూరు నుంచి కాదు ఏ దేశాన్నుంచి, ఎన్నడూ ఎవ్వరూ రాలేదండి" అని ఆ తరుణీమణి స్పష్టంగా వివరించింది.

"నిజంగానా" అని హీనస్వరంతో శెట్టి పలుకుతూనే, టెలిఫోను క్రింద పెట్టేసి, చేతులు వణుకుతూ జేబులోంచి ముత్యాల హారం తీసి, డ్రాయరులోంచి భూతద్దం తీసి జాగ్రత్తగా పరీక్షించి చూశాడు. ఈ ముత్యాల హారం అచ్చంగా తాను అమ్మిందే. అయితే ఇది ఎఱ్ఱ ముఖమల్ పెట్టెలో అమర్చి ఉంది. ★